

ఒంగోలు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలోని ఎస్సీ వెల్ఫేర్ కాలేజీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్ల దుస్థితి


పాచిపట్టిన స్నానపుగది



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, మీటర్లు


పెచ్చులూడిన పైకప్పుతో అధ్వానంగా ఉన్న హాస్టల్ గది

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను హడలెత్తిస్తున్నాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్న హాస్టళ్లలో చదువు కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఉంటూ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, స్థానిక పాలకులు, అధికారుల అలసత్వం వెరసి విద్యార్థుల పాలిట శాపంగా మారడంతో నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారు. కనీస సౌకర్యాలు కూడా లేని పాడుబడిన భవనాల్లో కాలం వెల్లదీస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను సాక్షి విజిట్ చేయగా, అనేక సమస్యలు వెలుగుచూశాయి.

హాస్టల్.. హడల్..!

విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడేలా ఉన్న సంక్షేమ హాస్టళ్లు

సాక్షి విజిట్


ఒంగోలు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలోని ఎస్సీ వెల్ఫేర్ కాలేజీ బాలుర వసతి గృహంలో కిటికీలకు రెక్కలు లేక దుప్పటి కట్టిన దృశ్యం


ఒంగోలు మంగమూరురోడ్డులోని బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో ఇరుకు గదిలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు


ఒంగోలు అన్నవరప్పాడులోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో ఆరుబయటే నేలపై కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు


చీమకుర్తి : హాస్టల్లో పెచ్చులూడిపడిన మచ్చుబల్ల


మద్దిపాడు ఎస్సీ హాస్టల్లో ఇరుకుగదిలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు


ఒంగోలు సంతపేటలో శిథిలావస్థలో ఉన్న భవనంలో నడుస్తున్న సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహం-2

- ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో దయనీయ పరిస్థితులు
- శిథిలావస్థలో హాస్టల్ భవనాలు, మరుగుదొడ్లు
- ఉడికీఉడకని అన్నం, అందుబాటులో లేని సురక్షిత నీరు
- లోపించిన పరిశుభ్రత, ప్రమాదకరంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ
- చదువు కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఉంటూ అవస్థపడుతున్న విద్యార్థులు
- చుట్టపుచూపుగా వచ్చిపోతున్న వార్డెన్‌లు
- మొక్కుబడిగా ఉన్నతాధికారుల విజిట్‌లు

చీమకుర్తి:

చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్లో 200 మంది బాలికలు కేవలం 5 రూముల్లో సర్దుకుని ఉంటున్నారు. సరిగ్గా పడుకోవడానికి కూడా స్థలం లేక ఒకపక్కకు తిరిగి పడుకుంటున్నారంటే హాస్టల్లో విద్యార్థుల అవస్థలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. ఈ దుస్థితిపై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో వసతులు సరిగ్గా లేవని పలుమార్లు పత్రికల్లో వచ్చిన కథనాలను చూసిన కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బాలికల కష్టాలు అడిగి తెలుసుకుని వెళ్లారు. కానీ, సోషల్ వెల్ఫేర్ డీడీగానీ, హాస్టల్ వార్డెన్‌గానీ కనీస మానవత్వం లేకుండా బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తమ సమస్యలు ఇంకెవరికి చెప్పుకోవాలో తెలియక హాస్టల్ బాలికలు కష్టాలతోనే కాలం వెల్లదీస్తున్నారు. వాస్తవానికి చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్ భవనంలో 60–70 మంది బాలికలు మాత్రమే నివసించడానికి వసతులు ఉన్నాయి. అలాంటిది, నూతనంగా ఏర్పడిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కారణంగా జిల్లాలోని పలు మండలాలు, సుదూర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది బాలికల వరకు చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్లో చేరారు. అసలే పాడుబడిన భవనం కావడం, పైనుంచి సీలింగ్ ఊడిపడుతూ ఉండటంతో ఇద్దరుముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలు అయ్యాయి. అదృష్టవశాత్తూ బతికి బయటపడటంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో శిథిలావస్థలో ఉన్న భవనం స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.2 కోట్లు మంజూరు చేసి నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదు. సంతనూతలపాడు ఎస్సీ బాలుర హాస్టల్ భవన నిర్మాణానికి కూడా రూ.2 కోట్లు మంజూరు చేశారు. అక్కడ నూతన భవనం నిర్మించేందుకు పాత భవనాన్ని పడగొట్టి టెండర్లు పిలిచారు. కానీ, చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌ను పడగొట్టి నూతన భవనాన్ని నిర్మించేందుకు అద్దెకు వేరే భవనం దొరకకపోవడంతో హాస్టల్ బాలికలను బయటకు తరలించే వీలు లేక పాత భవనంలోనే ఉంచారు. దీంతో నిత్యం సమస్యలు వేధిస్తున్నాయని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెనూపై తీవ్ర విమర్శలు...

చీమకుర్తి బాలికల హాస్టల్లో విద్యార్థినులకు ప్రభుత్వం చెప్పిన విధంగా మెనూ పాటించటం లేదనే విమర్శలున్నాయి. సాయంత్రం ఇవ్వాల్సిన పండ్లు అందడం లేదు. చిక్కీల సంగతి అటకెక్కింది. వంట మనుషులకు అసలు వంట చేయడం వచ్చా..? అన్నట్లుగా ఆహారం ఉంటోంది. వారు వండే ఇడ్లీ రాళ్లను తలపిస్తున్నాయని బాలికలు వాపోతున్నారు. కూరలు, పచ్చళ్లే ఏం చేసినా రుచీపచీ ఉండటం లేదని, అసలు అది ఏం కూరో చెప్పడానికి కూడా వీలుపడని విధంగా ఉంటున్నాయని చెబుతున్నారు. మజ్జిక కోసం 200 మంది బాలికలకు ఒకటిన్నర నుంచి రెండు లీటర్ల పాలు మాత్రమే వాడుతున్నారంటే.. మెనూ అమలు ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆదివారం చికెన్ పెట్టాలంటే 200 మందికి కేజీ చికెన్ వండి చేతులు దులుపుకుంటున్నారని, కారం నీళ్లు తప్ప ఒక్కొక్కరికి ఒక్క ముక్క కూడా వేయడం లేదని బాలికలు వాపోతున్నారు. దుస్తులు వాష్ చేసే ప్రాంతం అపరిశుభ్రంగా ఉంది. రక్షిత మంచినీరు లేక బోరు నుంచి వచ్చే నీటితోనే కాలం వెల్లదీస్తున్నారు. హాస్టల్‌లో వాచ్‌మెన్‌లు, వంట మనుషులు పేరుకైతే ఉన్నారుగానీ, ఒకటీరెండు మినరల్ వాటర్ బబుల్స్ తెచ్చుకుని బాలికలకు ఇవ్వకుండా దాచిపెట్టుకుంటున్నారని తెలిసింది. ఇలా చెప్పుకుంటూపోతే చీమకుర్తి ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఉంటూ చదువుకోవడం అంటే పెద్ద సవాలే అన్నట్లుగా విద్యార్థినులు వాపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి బాలికలను చదివించే వరకు ఉండాల్సిన వార్డెన్ చుట్టపుచూపుగా వస్తూ 10 నుంచి 15 నిమిషాలకంటే ఎక్కువ సమయం గడపకుండా వెళ్లిపోతున్నారని, సమస్యలేమీ పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చీమకుర్తిలోని ఎస్సీ బాలురు, బీసీ, ఎస్టీ బాలుర హాస్టళ్లలోనూ విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడంలో వార్డెన్‌లు, జిల్లా ఉన్నతాధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఫలితంగా విద్యార్థులు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు.

మద్దిపాడు మండలంలోని హాస్టళ్లలో నేలపైనే నిద్ర...

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడులో ఒక బీసీ వసతి గృహం, ఒక ఎస్సీ బాలుర వసతి గృహం ఉన్నాయి. రెండు వసతి గృహాల్లోనూ విద్యార్థులు కిందే పడుకుంటున్నారు. బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు డైనింగ్ హాల్ లేకపోవడం, బాత్‌రూమ్‌లు కొన్నింటికి తలుపులు ఉన్నా రేకులు విరిగిపోయి ఉండడం, మరికొన్నింటికి తలుపులే లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. విద్యార్థులు చదువుకోవడానికి, భోజనం చేయడానికి కూడా ఇబ్బందికర పరిస్థితులున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకూ హాస్టల్ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ శాఖ వారు ప్రతి సంవత్సరం ఇచ్చే చాపలు, కాస్మొటిక్ చార్జీలు ఇవ్వకపోవడంతో చాలా మంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచి కాస్మొటిక్స్ తెచ్చుకుంటున్నారు. చాపలు లేకపోవడంతో వార్డెన్లు గత సంవత్సరం విద్యార్థులకు ఇచ్చిన ఛద్దర్లు ఇచ్చారు.

నాగులుప్పలపాడు మండలంలో తాగునీటి సమస్య...

మండలంలోని బీ నిడమానూరు, అమ్మనబ్రోలు, పోతవరం గ్రామాల్లో మొత్తం మూడు హాస్టళ్లు ఉన్నాయి. అమ్మనబ్రోలు ఎస్సీ హాస్టల్లో విద్యార్థులకు స్నానాల గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానం చేస్తూ అసౌకర్యానికి గురవుతున్నారు. పోతవరంలో తాగునీటి సమస్యతో అసవ్వపడుతున్నారు. మంచినీరు కూడా అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా దొరుకుతున్న బోరు నీటినే వాడుకుంటున్నారు.

ఒంగోలులో శిథిలావస్థలో హాస్టల్ భవనాలు...

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని హాస్టల్ భవనాలన్నీ శిథిలావస్థకు చేరి పాడుబడిపోయి బూతు బంగళాలను తలపిస్తున్నాయి. ఏ ఒక్క హాస్టల్లోనూ కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కాకుండా ఉన్నాయి. మరమ్మతులకు నోచుకోక వాడుకలో లేని మరుగుదొడ్లు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ సరఫరా వ్యవస్థ, అపరిశుభ్ర వాతావరణం, ఇరుకు గదుల్లో కిక్కిరిసి ఉంటున్న విద్యార్థులు, రాత్రి వేళల్లో ఆరుబయట సరైన వెలుతురు కూడా లేకుండా భోజనాలు, ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లా కేంద్రంలోని హాస్టళ్లలో విద్యార్థుల కష్టాలు కన్నీళ్లు పెట్టించేలా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం, పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నగరంలోని హాస్టళ్లలో అనేక దృశ్యాలు కనిపిస్తున్నాయి.


ఒంగోలు సంతపేటలో శిథిలమైన భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ వికలాంగ బాలుర వసతి గృహం


చీమకుర్తిలో శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలికల హాస్టల్


మద్దిపాడు బీసీ హాస్టల్లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు


చీమకుర్తి : అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న కుళాయిలు

దత్తత తీసుకున్న కుటుంబాలకు పీడీ పరామర్శ


ఏడుగుండ్లపాడులో దత్తత తీసుకున్న కుటుంబంతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణ

మద్దిపాడు: మండల స్పెషలాఫీసర్, డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ పీ–4లో భాగంగా మండలంలోని ఏడుగుండ్లపాడు గ్రామంలో దత్తత తీసుకున్న మూడు కుటుంబాల వారిని శనివారం ఆ గ్రామానికి చేరుకుని పరామర్శించారు. చినిగే జయమ్మ, పతకమూరి మాధవి, కళ్లగుంట సుబ్బమ్మ కుటుంబాలను కలిసి వారి జీవనశైలిని పరిశీలించారు. వారికి ప్రభుత్వ పరంగా అందించాల్సిన గృహాలు, పెన్షన్, గ్యాస్ కనెక్షన్, అవసరమైన ఇతర సదుపాయాలు కల్పిస్తానని చెప్పారు. తాను వారికి ఆర్థికంగా కూడా సహాయం అందిస్తానని తెలిపారు. పిల్లల చదువులకు ఇబ్బంది రాకుండా చూసుకుంటానని చెప్పారు. మాధవి అనే మహిళకు టైలరింగ్ ఎంబ్రాయిడింగ్ మిషన్ అందిస్తానని, ఆమె జీవనోపాధికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అట్టడుగు వర్గాల వారికి ఆర్థికస్థితి మెరుగ్గా ఉన్న వారు సహాయపడటం కోసమే పీ–4 పథకం కార్యక్రమాన్ని రూపొందించినట్లు పీడీ తెలిపారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం కాకుమాను సుబ్బారావు, సర్పంచ్ శిల్పాసౌందర్య, సీసీలు, వీఓఏలు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

క్విస్ కాలేజీలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


ర్యాలీ నిర్వహిస్తున్న క్విస్ కాలేజీ విద్యార్థులు

ఒంగోలు సిటీ: భారత భూభాగాన్ని ఆక్రమించుకోవాలని కుట్ర పన్నిన పాకిస్థాన్‌కు ఇండియన్ ఆర్మీ సత్తా చూపించిన రోజయిన జూలై 26, 1999 సందర్భంగా శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అమరవీరులను స్మరించుకున్నారు. విద్యార్థులకు కార్గిల్ గురించి, దేశ సైన్యం గురించి ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. 34ఏ ఎన్‌సీసీ బెటాలియన్ ఒంగోలుకు చెందిన సుబేదార్ మేజర్ పుష్పరాజ్ ప్రత్యేక సెమినార్‌లో మాట్లాడారు. కార్గిల్‌లో సైనికులు పోరాడిన తీరును విద్యార్థులకు ఆయన వివరించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొని ప్రస్తుతం క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో విజిలెన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న హర్షవర్ధన్ తన అనుభవాలను పంచుకున్నారు. ఆర్మీ మాజీ కెప్టెన్ రమణయ్య, తదితరులు మాట్లాడారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రిదేవి అమరవీరులకు నివాళులర్పించారు. సెమినార్ అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి.హనుమంతరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్యమెహర్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ హెడ్‌లు, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు సూచించారు. శనివారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యతకు సంబంధించిన పలు పథకాలపై వారితో సమీక్షించారు. పీ4కు సంబంధించి బంగారు కుటుంబాల అడాప్షన్, డేటా రీవాల్యుయేషన్, తదితర వాటిపై ఎంపీడీవో వివరించారు. గ్రామాల్లో శానిటేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. డోర్ టూ డోర్ గార్బేజ్ కలెక్షన్ కార్యక్రమాన్ని, శానిటేషన్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో రమణమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుసూదన్‌రావు, వెల్ఫేర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి విలువలు కలిగి ఉండాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): ప్రతి విద్యార్థి విలువలు కలిగి క్రమశిక్షణతో నడుచుకోవాలని సంతనూతలపాడు ఎస్ఐ అజయ్‌బాబు సూచించారు. శనివారం మద్దులూరు హైస్కూల్లో విద్యార్థులకు గుడ్ టచ్–బ్యాడ్‌టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులంతా సైబర్ క్రైమ్, రోడ్డు భద్రతా ప్రమాణాలు, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయా చట్టాల గురించి వివరించారు. పాఠశాల పరిసరాలను డ్రోన్ కెమేరాతో పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'


ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, నాయకులు

కొత్తపట్నం: స్థానిక నల్లూరి గార్డెన్ పక్కనున్న ఖాళీ స్థలంలో ఆదివారం నిర్వహించనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ సమావేశాన్ని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు ఎకరాల పొలంలో భారీగా సమావేశం నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. ట్రాక్టర్ సహాయంతో గడ్డి మొక్కలు, పిచ్చి మొక్కలు తొలగించి స్థలాన్ని చదును చేశారు. 30 అడుగుల స్టేజీ, లైట్లు, వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. సాయంత్రం భోజన వసతులు కల్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. వంట చేయటానికి అదనంగా టెంట్లు వేయాలని, భోజనం చేయడానికి రోడ్డు పక్కనే చదును చేయాలని పార్టీ కార్యకర్తలను ఆదేశించారు. అప్పటికప్పుడే రోటావేటర్ సహాయంతో చదును చేశారు. 2 వేల మంది కూర్చోడానికి కుర్చీలు, మ్యాట్లు, 40 మంది కూర్చోడానికి స్టేజీ, 2 వేల మందికి భోజనాలకు ఆరు చోట్ల బల్లలు ఏర్పాటు చేయించారు. ట్యాంకర్లతో నీరు, తాగు నీరు సరఫరా చేయాలని చెప్పారు. హాజరయ్యేవారెవ్వరూ ఇబ్బంది పడకుండా చూడాలని కోరారు.

800 బైకులకు జెండాలు కట్టుకుని భారీ ర్యాలీ...

సమావేశానికి ముందుగా కొత్తపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి సభా ప్రాంగణం వరకు 800 బైకులకు వైఎస్సార్ సీపీ జెండాలు కట్టుకుని పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. మధ్యలో బస్టాండ్ సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఎస్సీ కాలనీలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని అంజిరెడ్డి కోరారు. ఏర్పాట్ల పరిశీలనలో ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు తంబి వెంకటేష్, నాయకులు నాగిరెడ్డి, గాలి ముసలారెడ్డి, ద్వారం మురళి, తంబి కాంతారావు, మల్లికార్జున, వెంకటనారాయణ, తంబి వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, పాలేటి ఆంజనేయులు, మూగా బాలాజీ, గరటారెడ్డి, పురిణి పోలయ్య, సుబ్బారావు, రామలింగం సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తంబి సురేష్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు: కుట్టుమిషన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ ఈడీ టి.వెంకటేశ్వర్లు సూచించారు. మద్దిపాడు సచివాలయం వద్ద నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్, కుట్టుమిషన్ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో 75 శాతం హాజరు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట శిక్షకురాలు ప్రసన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.